క్లుప్తంగా

కరాటేలో నేతాజీ విద్యార్థులకు పతకాలు



బంగారు, కాంస్య పతక విజేతలు గీతాంజలి, సురేఖ

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు నేతాజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖేలో ఇండియా పోటీల్లో విజయం సాధించారు. ఇటీవల తిరుపతి శ్రీ పద్మావతి మహిళా కళాశాలలో జరిగిన అండర్ – 14 విభాగంలో నిర్వహించిన కరాటే పోటీల్లో వై. గీతాంజలి బంగారు పతకం, వై. సురేఖ కాంస్య పతకం సాధించారు. దీంతో పాఠశాల కరస్పాండెంట్ సాయి కిరణ్ విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు వివిధ రకాల క్రీడల్లో కూడా శిక్షణ ఇప్పిస్తున్నామని.. శారీరక వ్యాయామం ఉంటేనే మానసిక వికాసం ఉంటుందని చెప్పారు.

నేడు, రేపు దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

చీమకుర్తి: దస్తావేజు లేఖర్లు బుధ, గురువారాల్లో పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు చీమకుర్తి దస్తావేజు లేఖర్ల సంఘం తరఫున మందపాటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డుప్రైమ్ 2.0 (ఓ)కు వ్యతిరేకంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్లు సంఘం, జిల్లా దస్తావేజు లేఖర్ల సంఘం పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. చీమకుర్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఎలాంటి దస్తావేజులు రాయడం ఉండదని, క్రయ, విక్రయదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్య పరిష్కరించాలి

నాగులుప్పలపాడు: బియ్యం పంపిణీలో జాప్యం నివారణకు కృషి చేయాలని మండల ఎండీయూ ఆపరేటర్ల సంఘం తరఫున మంగళవారం తహసీల్దార్ సుజన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతి కార్డుదారుడు నుంచి 2 సార్లు వేలిముద్రలు తీసుకునే క్రమంలో సర్వర్‌లో తలెత్తిన సమస్యల వలన రేషన్ పంపిణీలో తీవ్ర ఆలస్యం అవుతోందని దీనితో ఆపరేటర్లపై హెల్పర్ల ఒత్తిడి పెరగడంతో పాటు ఆయిల్ వినియోగం పెరుగుతోందన్నారు. పెండింగ్ జీతాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ముంగర నాగార్జున, లక్ష్మీనారాయణ, ఆపరేటర్లున్నారు.

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచకపోతే చర్యలు



శానిటరి సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు టౌన్: నగరంలో రోడ్లను పరిశుభ్రంగా ఉంచకుంటే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం పరిస్థితులను పరిశీలించారు. ఏకలవ్య నగర్, వంటవాని కాలనీలో పర్యటించిన కమీషనర్ రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. 24వ డివిజన్ కార్పొరేటర్ శైలజ, శానిటరి ఇన్‌స్పెక్టర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా సెంట్రల్ స్కూలు విద్యార్థులు అలంకరించిన తెలుగు తల్లి చిత్రం



పిరమిడ్‌ల రూపంలో ప్రదర్శనలిస్తున్న బాలికలు



తెలుగు ఉపన్యాసకులు నల్లూరి అంజయ్యను సత్కరిస్తున్న శ్రీసరస్వతి విద్యాసంస్థల అధ్యాపకులు



మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆర్.వెంకట్రావు

● ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తెలుగు భాష తీయనిది

ఒంగోలు: తెలుగు భాషా దినోత్సవం మంగళవారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో వైభవంగా జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ తెలుగుకు ఆదరణ తగ్గిపోతోందని, పరభాషా వ్యామోహంలో తెలుగును విస్మరిస్తున్నారన్నారు. తెలుగు వాడుక భాషగా ఉండాలని నిరంతరం శ్రమించిన గొప్ప సంఘ సంస్కర్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.మాధవరావు పాల్గొన్నారు.

సాయిబాబా సెంట్రల్ స్కూల్‌లో..

స్థానిక సాయి బాబా సెంట్రల్ స్కూల్‌లో క్విజ్, వ్యాసరచన, పద్య పోటీలను నిర్వహించారు. అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని, కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ యం.మహేష్ పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసపత్రాలను అందించారు.

భాష్యం హైస్కూలులో

గ్రాంథిక భాషా సుడిగుండంలో చిక్కుకున్న తెలుగు భాషను వాడుక భాషగా వినియోగించేందుకు ఉద్యమించిన వ్యవహారిక భాషా ఉద్యమ నేత గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పాన్నూరు వెంకట శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భాష్యం హైస్కూలులో రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన చిన్నారులకు ప్రిన్సిపాల్ ఎం.వెంకటరమణ బహుమతులు అందించారు.

సరస్వతి డిగ్రీ కాలేజీలో..

స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీసరస్వతి డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం జరిగింది. శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన కృషి ఫలితమే నేడు వ్యవహారిక భాషలో తెలుగును అధ్యయనం చేస్తున్నామన్నారు. తెలుగు భాష ఉపన్యాసకులు నల్లూరి అంజయ్యను ఘనంగా సత్కరించారు. కాలేజీ డైరెక్టర్లు గణేష్‌రెడ్డి, గంగా శంకరరెడ్డి, సీఈవో ఎన్.వెంకట సురేష్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.రాజేంద్రబాబు, ఆర్.జోసెఫ్ పాల్గొన్నారు.

ఘనంగా భాష, క్రీడా దినోత్సవాలు

చీమకుర్తి: సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకున్నారు. చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలు, జిల్లా పరిషత్ బాలికల హైస్కూళ్లలో విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. జిల్లాపరిషత్ బాలికల హైస్కూలులో పీడీ స్వరూపావాణి ఆధ్వర్యంలో ప్రదర్శించిన పిరమిడ్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వి.సుబ్రహ్మణ్యం, ఎన్.సెబ్బారావు, టీచర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి: సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలోని విద్యార్థులకు పలు క్రీడాపోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.జయరామిరెడ్డి ప్రశంస పత్రాలను అందించారు.

హాకీలో పోటీలు..

సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో మహిళలు, పురుషులకు హాకీ పోటీలను నిర్వహించారు. మహిళల హాకీలో మైనంపాడు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. పురుషుల విభాగంలో హాకీ క్లబ్ మైనంపాడు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్ బహుమతులను అందించారు.

ఘనంగా జాతీయ క్రీడా దివస్

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం జాతీయ క్రీడా దివస్ ఘనంగా నిర్వహించారు. క్విస్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో గెలుపొందిన విద్యార్థులు కాలేజీ చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి , వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రి బహుమతులు అందించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతులను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు అభినందించారు.

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో:

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.ధనుంజయరావు మాట్లాడుతూ క్రీడల ద్వారానే మానసిక పరిపక్వత కలుగుతుందన్నారు. విద్యార్థినులకు బహుమతులను అందించారు. అధ్యాపకులు కుసుమకుమారి, డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపట్నం: తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పాలేటి సుబ్బారావు అన్నారు. పీడీ సాయికిషోర్ మాట్లాడారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరావు, హరిబాబు, శేషారావు, వెంకట్రావు, కృష్ణమూర్తి, కోటేశ్వరరావు, శరత్‌చంద్ర, రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, ధన జ్యోతి, వసుందర, చంద్రశేఖర్, కల్యాణ్ పాల్గొన్నారు.



శ్రీనివాసులును సత్కరిస్తున్న భాష్యం ప్రిన్సిపాల్ వెంకట రమణ



వాలీబాల్ ఆడుతున్న క్విస్ విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి



తెలుగు భాషా దినోత్సవంలో బాలికలు



ట్రిపుల్ ఐటీ కాలేజీలో ప్రశంస పత్రాలను అందుకుంటున్న క్రీడాకారులు



మైనంపాడులో హాకీలో ప్రథమ స్థానంలో నిలిచిన మహిళల జట్టు



కొత్తపట్నంలో బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ



గోవిందనామాలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



బ్రహ్మోత్సవాల్లో యాగం చేస్తున్న రుత్వికులు

ఒంగోలు మెట్రో: వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీగిరి ప్రదక్షిణను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని అలంకరించి 300 మంది పైగా మహిళలు, పురుషులు పసుపు రంగు పతాకాలను చేపట్టి గోమాతలను అనుసరించారు. స్థానిక జయరాం హాలు వద్ద గల శ్రీబాపూజీ కోసం సంరక్షణ సంఘం (గోశాల) వద్ద నుంచి శ్రీగిరి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. శ్రీగిరి గిరి ప్రదక్షిణ కోర్టు సముదాయాలు మాతా శిశు వైద్యశాల, జిల్లా కేంద్ర గ్రంథాలయం ముందుగా కేశవస్వామి పేట దేవాలయాల ముందుగా , సీతారాంపురం అయ్యప్ప స్వామి దేవస్థానం తదితర మందిరాలను చుట్టి భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తొలిసారి శ్రావణమాసం శ్రవణా నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ నిర్వహించామని కమిటీ అధ్యక్షురాలు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. గౌరవాధ్యక్షురాలు చలువాది బదిరి నారాయణ, అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, ఉపాధ్యక్షులు తూనుగుంట మల్లిఖార్జునరావు, దాసరి నారాయణరావు, కార్యదర్శి త్రిపురం మల్లిఖార్జునరావు, సహకారదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారివలేటి కృష్ణారావు, కార్యవర్గసభ్యులు ధనిశెట్టి రామునాయుడు, చలువాది బ్రహ్మయ్య, గోసంఘం అధ్యక్షుడు తటవర్తి వాసు, గీతాపరివార్, గో సంఘం, గాయత్రి పరివార్ భక్త బృందం, హైందవ సంఘ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ దారి పొడుగునా స్థానిక ఆలయ నిర్వాహకులు పాలు, మజ్జిగ, మంచినీరు భక్తులకు అందించారు.

కొండమీద శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు తదితరులు పర్యవేక్షించారు.

వైద్య రంగానికి పెద్ద పీట

ఒంగోలు రూరల్: వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేయడం వలనే కరోనా సమయంలో వేలాదిగా, లక్షలాదిగా ఇతర దేశాల్లో మరణాలు సంభవించగా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి మరణాలు నిరోధించిందని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్.వాణి అన్నారు. సర్వేరెడ్డిపాలెంలో కార్యదర్శి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం నేడు మెడికల్ కాలేజీ అనుమతి ఇవ్వడమే కాకుండా 104, ఆధునిక 108 వాహనాలను ప్రజల సౌకర్యార్థం సమకూర్చిందన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి

గుండెపోటుపై ప్రాథమిక అవగాహన అవసరం



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఒంగోలు: గుండెపోటుపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని హృద్రోగ నిపుణులు డాక్టర్ బీఎంవీ కృష్ణ చైతన్య తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా గుండెపోటుతో కూలిపోయినప్పుడు చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం డాక్టర్ పీఎస్ఎల్ శ్యామల విద్యార్థుల చేత హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన విధానాన్ని నేర్పించి డెమో చేయించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, మెడికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీ కన్వీనర్ కె.అరుణకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాధిపతులు వి.శ్రీలక్ష్మి, సీహెచ్ శ్రీనివాసరావు, జంతుశాస్త్ర అధ్యాపకులు వీఎస్ విద్యుల్లత, జేకేసీ మెంటార్ జె.సురేష్‌కుమార్, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న ఎంపీపీ

నాగులుప్పలపాడు: మహనేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న నిర్వహించే పలు సేవా కార్యక్రమాలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వర్ధంతి ఏర్పాట్ల సందర్భంగా నాయకులతో మాట్లాడారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

ప్రణీత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాలిశెట్టి

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నేత బాలినేని ప్రణీత్‌రెడ్డిని బాలిశెట్టి నాగేశ్వరరావు సత్కరించారు. మంగళవారం బాలినేని నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలిశెట్టి మాట్లాడుతూ తనకు జిల్లా ఉపాధ్యక్ష పదవి దక్కేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి కారణమన్నారు. 2024 ఎన్నికల్లో బాలినేని గెలుపుకోసం కృషి చేస్తానన్నారు.



ప్రణీత్‌రెడ్డిని సత్కరిస్తున్న బాలిశెట్టి నాగేశ్వరరావు

ఓట్ల సర్వే పరిశీలన



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ



ఓట్ల సర్వే తనిఖీ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా

కొత్తపట్నం: ఓట్లు సర్వే చేస్తున్న బీఎల్‌వోల పనితీరును నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. చనిపోయిన వారి డెత్ సర్టిఫికెట్లు జత చేసిన తర్వాత తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ బీవీ రమణారావు, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఆర్‌ఐ రామసుబ్బారావు, వీఆర్వో మాధవి, బీఎల్‌వో పురిణి నాంచారమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొత్త ఓట్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు టౌన్: మండలంలో 18 ఏళ్ల నిండిన వారంతా 2024 జనవరి 1లోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆర్డీఓ విశ్వేశ్వరరావు కోరారు. మంగళవారం తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో డబల్ ఓట్లు, చనిపోయి ఓట్లపై సమీక్ష సమావేశం జరిగింది. 2019 ఎన్నికల ముందు 2,29,317 ఓట్లు ఉండగా ఇప్పటి వరకు 2,36, 489 ఓట్లు నమోదై ఉన్నాయని వివరించారు. తహసీల్దార్ మురళి, డీటీ షేక్ రఫీ, డిప్యూటీ డీటీ శ్రీదేవి, రాజకీయపార్టీల ప్రతినిధులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, బీజేపీ నాయకులు బి.రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రసూల్, సీపీఎం నాయకులు రమేష్, టీడీపీ నాయకులు స్వరూప్ పాల్గొన్నారు.

ఎయిడెడ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు: విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు.

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో 20 పనులకు ఆమోదం



అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌కాప్)లో భాగంగా నగర పాలక సంస్థకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 20 పనులకు సిటీ ఇంప్లిమెంటేషన్ కమిటీలో ఆమోదం లభించింది. మంగళవారం ప్రకాశం భవనంలో కమిటీ చైర్మన్, ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షన సమావేశం నిర్వహించారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా రూ.3.91 కోట్ల నిధుల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. మంజూరైన నిధులతో నగరపాలక సంస్థలోని వివిధ డివిజన్లలో పార్కుల అభివృద్ధి, గ్రీనరీ, సీసీ రోడ్లు తదితర 20 పనులకు అంచనాలు తయారు చేయగా ఎన్‌కాప్ నిబంధనల మేరకు కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్.సుశీల, బి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.